సాక్షి ఒడిశా

ఆదివారం । 25 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,34,560
బంగారం : 600 మిల్లీ గ్రాములు
వెండి : 98 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



99 శాతం పనులు పూర్తి

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ పనులు 99 శాతం పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభించనున్నారు. - 8లో



జాతీయ విద్యా విధానం..

జాతీయ విద్యా విధానం యువతకు సోపానమని గవర్నర్ అన్నారు. విద్యా సదస్సులో ఆయన ప్రసంగించారు. - 8లో

న్యూస్‌రీల్

నబరంగ్‌పూర్ జిల్లాకు చేరుకున్న పీసీసీ చీఫ్



వేదికపై పీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్, పరిశీలకుడు అజయ్ లలూ తదితరులు

కొరాపుట్: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి స్వీకరించిన తర్వాత భక్త చరణ్ దాస్ తొలిసారిగా నబరంగ్‌పూర్ జిల్లాకు చేరుకున్నారు. శనివారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్ వద్దకు వచిన ఆయనకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లాలో పార్టీ పరిస్థితిపై నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకుడు అజయ్ లలూ, నాయకులు భుజబల్ మఝి, డాక్టర్ లిఫికా మఝి, దిలిప్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ



మజ్జిగ వితరణ కార్యక్రమంలో యువమంచ్ సభ్యులు

రాయగడ: స్థానిక మార్వడీ యువమంచ్ ఆధ్వర్యంలో స్థానిక రాణి కాంప్లెక్స్ వద్ద శనివారం మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఎండతో ఇబ్బంది పడుతున్న బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టామని యువమంచ్ అధ్యక్షులు కమల్ జైన్, కార్యదర్శి ఉజ్వల్ జైన్‌లు తెలియజేశారు. సుమారు వెయ్యిమంది బాటసారులకు మజ్జిగ వితరణ చేసినట్లు వివరించారు. ప్రతీ ఏడాది వేసవిలో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా్నారు.

జయపూర్‌లో గ్యాంగ్ వార్



జయపూర్ జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షత గాత్రుడు

కొరాపుట్: జయపూర్‌లో గ్యాంగ్ వార్ జరగగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నబరంగ్‌పూర్‌కి చెందిన కొందరు యువకులు జయపూర్ సమీపంలోని బ్రహ్మణి గాంలో వివాహానికి వెళ్లారు. అక్కడ కొందరి మధ్య మనస్పర్థలు రేగాయి. అనంతరం జయపూర్‌లో నువావీధి లో రెండు గ్రూపులు ఎదురెదురు కావడంతో కొట్లాటకు దిగారు. ఘటనలో బ్రహ్మణి గాంకి చెందిన అర్జున్ హరిజన్, నబరంగ్‌పూర్‌కి చెందిన సాగర్ నాయక్, అజిత్ నాయక్, సాగర్ హరిజన్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను జయపూర్‌లోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సాగర్ నాయక్, అర్జున్ హరిజన్ లను కొరాపుట్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి తరలించారు.

వ్యాన్ బోల్తా : 8 మేకలు మృతి



బోల్తా పడిన వ్యాన్

రాయగడ: సదరు సమితి జిమిడిపేట సమీపంలోని మలుపులో పికప్ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ఎనిమిది మేకలు మృతి చెందాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయిపూర్ నుంచి 30 మేకల లోడుతో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వైపు వెళుతున్న వ్యాన్ జిమిడిపేట వద్ద అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలు తగిలాయి. సమాచారం తెలుసుకున్న శెఖాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీతో రోడ్డు పక్కకు నెట్టించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మేకలు

వాన.. హైరానా



భువనేశ్వర్: గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తెరిపి లేకుండా వాన కురుస్తోంది. నిన్న మొన్నటి వరకు కాలవైశాఖి వాతావరణం ప్రభావంతో వానలు పడ్డాయి. శనివారం నుంచి రుతు పవనాల ప్రభావిత ముందస్తు వానలుగా వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో సాధారణ జన జీవనం ప్రభావితమైంది.

గత 24 గంటల్లో నమోదైన వర్షపాతం

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
గంజాం	పత్రపూర్	117.4
సుందరగడ్	తెన్సా	86.0
గంజాం	సనొఖెముండి	82.0
ఢెంకనాల్	భుబన్	72.0
కంధమల్	కొటొగొడొ	55.0
మయూర్‌భంజ్	కరంజియా	54.0
గంజాం	బెల్లొఘుంటొ	52.2
బొలంగీరు	పట్నగొడొ	49.0
గంజాం	దిగొపాహొండి	48.0
ఢెంకనాల్	కామాక్ష్య నగర్	46.4
మయూర్‌భంజ్	సులియాపాడా	46.0
కెంజొహర్	ఘషిపురా	45.2



కుండపోత వానలో దూసుకుపోతున్న వాహనాలు



హోరు వానలో కూటి సాధన

తొందరగా తాకిన నైరుతి రుతు పవనాలు

భువనేశ్వర్: ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు తొందరగా కేరళను తాకాయి. సాధారణం కంటే 8 రోజులు ముందుగానే రుతు పవనాలు రావడం విశేషం. 16 ఏళ్ల తర్వాత ఈ పరిస్థితి పునరావృతమైంది. లోగడ 2009 సంవత్సరం మే 23వ తేదీన తాకినట్లు అధికారిక వర్గాల సమాచారం. సాధారణంగా ఏటా జూన్ 1న కేరళలోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. రుతుపవనాలు కేరళను తాకిన 10 నుంచి 12 రోజుల్లో ఒడిశాలోకి ప్రవేశిస్తాయి. ఈ లెక్కన ఈ ఏడాది జూన్ మొదటి వారంలో లేదా 10వ తేదీకి ముందు రుతుపవనాలు ఒడిశాలోకి ప్రవేశించే అవకాశం ఉంది. మరో వైపు రుతు పవనాల ఆగమనానికి అనుకూలమైన వాతావరణం రాష్ట్రంలో నెలకొని ఉంది. శనివారం ఉదయం నుంచి రాష్ట్రంలో రుతుపవనాల ప్రభావిత ముందస్తు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం ఐఎండీ స్పష్టం చేసింది.



నైరుతి రుతు పవనాల కదలిక




జోరు వానలో బతుకు బండి లాగుతున్న బడుగు జీవి



చెట్టు చాటున రక్షణ పొందుతున్న మహిళలు

కడుపులో కణితి ఉంటే.. గర్భవతని చెప్పారు

• కాశీపూర్‌లో వైద్యుల నిర్వాకం



తన భార్య గర్భవతి అని వైద్యులు గుర్తించి మంజూరు చేసిన కార్డులను చూపిస్తున్న కవిచంద్ర

రాయగడ: ఒక మహిళ గర్భంలో కణితి పెరుగుతూ ఉంటే.. ఆమె గర్భవతి అని నిర్ధారించి కాశీపూర్ వైద్యులు చికిత్స అందించారు. కాశీపూర్ సమితి పరిధిలో గల ఖరిగా గ్రామంలో కవిచంద్ర జొడియా, అతని భార్య రుని జొడియా సరజలు నివసిస్తున్నారు. ఆరు నెలల కిందట రుని జొడియా తీవ్ర అస్వస్థతకు గురైంది. భర్త ఆశ కార్యకర్తను సంప్రదించగా ఆమె ప్రెగ్నెన్సీ పరీక్షలు చేసింది. కన్ఫర్మ్ కావడంతో గత ఏడాది డిసెంబర్ 27న కాశీపూర్‌లో గల పీహెచ్‌సీకి రునిని తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలను నిర్వహించిన వైద్యులు ఆమెను గర్భవతిగా గుర్తించి అందుకు అనుగుణంగా కాల్షియం, విటమిన్ అదేవిధంగా టీకాలను ఇస్తూ వచ్చారు. ఆమె పేరున మమత కార్డును (గర్భవతి మహిళకు ఇచ్చే కార్డు) కూడా మంజూరు చేశారు. ఈ నెల (మే) 3 వ తేదీన ఆమె పరిస్థితి విషమించడంతో భర్త వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు అన్ని పరీక్షలను నిర్వహించిన అనంతరం ఆమె గర్భవతి కాదని కడుపులో ట్యూమర్ పెరుగుతుందని తక్షణమే మెరుగైన వైద్య అందించాలని సూచించారు. అనంతరం ఆమెను కొరాపుట్ లో గల సహీద్ లక్ష్మణ్ నాయక్ హస్పటల్‌కు తరలించారు. ప్రస్తుతం కొరాపుట్‌లో చికిత్స పొందుతున్న రుని పరిస్థితి విషమిస్తున్నా ఇంతవరకు ఆమెకు ట్యూమర్‌కు సంబంధించిన ఎలాంటి ఆపరేషన్‌ను చేయలేదని ఆమె భర్త కవిచంద్ర తెలిపారు. వైద్య శాఖ అధికారులు స్పందించి తన భార్యను కాపాడాలని కోరుతున్నాడు.

• కొత్త రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిత్యానంద గోండో, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మఝి, నర్సింగ బోత్ర

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘిక సంక్షేమ, మైనారిటీ సెల్ శాఖల మంత్రి నిత్యానంద గోండో ప్రారంభించారు. శనివారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాస్తవానికి రాష్ట్ర వినియోగదారులు, ఆహార సరఫరా, శాస్త్ర సాంకేతిక మంత్రి క్రిష్ణ చంద్ర పాత్రో కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే హెలీకాప్టర్‌లో సాంకేతిక లోపంతో ఆయన రాలేకపోయారు. దీంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి ఆదేశాలతో జిల్లా మంత్రి నిత్యానంద గోండో హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పది వేల 72 నూతన కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మఝి, నర్సింగ్ బోత్ర పాల్గొన్నారు.

ముగిసిన దాసాంజనేయ త్రిరాత్రి మహోత్సవాలు



దాసాంజనేయునికి పూజలు నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు



పూజలు చేస్తున్న మహిళలు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న దాసాంజనేయ త్రిరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా సహస్ర నామ పూజలు, తమలపాకులతో అర్చనలు, అనంతరం హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రామ పట్టాభిషేకంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలికను మోసం చేసిన బీజేపీ నేత కుమారుడు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బీజేపీ నేత కుమారుడు రాజేంద్ర భోత్ర ఒక బాలికను గర్భవతిని చేశాడని జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో శుక్రవారం బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక వివాహంలో తన కుమార్తెకు బొరిగుమ్మ సమితి సనపొరియ పంచాయతీ సవునిగుడ గ్రామంలో రాజేంద్ర భోత్ర పరిచయమయ్యాడని, అనంతరం రాజేంద్ర తన కుమార్తెను ప్రలోభపరిచి గర్భవతిని చేశాడని ఆమె పేర్కొన్నారు. పెళ్లి చేసుకుంటానని హామీ కూడా ఇచ్చాడని తెలిపారు. కుమార్తెకు కడుపు నొప్పి రావడంతో వైద్య పరీక్షలు చేయిస్తే గర్భవతి అని తెలిసిందని అన్నారు. దీనిపై గ్రామ పెద్దలు కూడా రాజేంద్రను సంప్రదిస్తే అతను స్పందించలేదన్నారు. రాజేంద్రది రాజకీయ కుటుంబమని, అందుకే ఈ ఘటనను మర్చిపోవాలని చెబుతున్నారని, కానీ న్యాయం కోసం తాను పోలీసులను ఆశ్రయించానని తెలిపారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

మల్కన్‌గిరి: వన్యప్రాణులను సంరక్షించాలని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి జిల్లాలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో వరల్డ్ టర్టిల్ డేను పురస్కరించుకొని శనివారం సదస్సు నిర్వహించారు. తాబేళ్ల అక్రమ రవాణా, విక్రయాల విషయంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడంపై చర్చించారు. వర్క్‌షాప్‌కు వన్యప్రాణులు, హెర్పటాలజీ నిపుణులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి తాబేళ్ల సురక్షతపై చర్చించారు. అక్రమ రవాణా జరుగుతున్న తాబేళ్లలను రక్షించి తిరిగి వాటిని నీటిలో విడిచిపెట్టే విధంగా అటవీ సిబ్బంది కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి



హాజరైన అటవీశాఖ సిబ్బంది

వేటగాళ్ల కాల్పుల్లో ఫారెస్ట్ గార్డు మృతి

• రూ. 30 లక్షల పరిహారం



ప్రహ్లాద్ ప్రధాన్ (ఫైల్)

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా అటవీ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న సమయంలో ఫారెస్ట్ గార్డు వేటగాళ్ల తుపాకీ గుళ్లకు బలయ్యాడు. 37 ఏళ్ల ప్రహ్లాద్ ప్రధాన్ కాల్పుల్లో చనిపోయాడు. అక్రమ వేట కార్యకలాపాలను అరికట్టే కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న తరుణంలో వేటగాళ్ల మూక ఈ అఘాయిత్యానికి పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి నలుగురు అనుమానితులను అరెస్టు చేశారు.

ఢెంకనాల్ జిల్లా హిందోల్ అటవీ ప్రాంతంలో 13 మంది అటవీ సిబ్బందితో కూడిన బృందం యథాతథంగా సాధారణ గస్తీలో ఉండగా వేటగాళ్లు పేలుళ్లకు పాల్పడ్డారు. రాజ్‌మోహన్‌పూర్ గ్రామ సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. తుపాకీ తూటా ప్రహ్లాద్ ప్రధాన్ పొట్టలోకి దూసుకుపోయి తీవ్రంగా గాయపరిచింది. తక్షణమే అంగుల్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది ఆయన మరణించినట్లు ప్రకటించారు. దాడి జరిగిన వెంటనే విధి నిర్వహణలో ఉన్న తోటి సిబ్బంది సమయస్ఫూర్తితో కాల్పులకు పాల్పడిన వేటగాళ్ల బృందం వైపు దృష్టి సారించింది. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారిలో భాగమని భావించిన నలుగురు వ్యక్తులను పెట్రోలింగ్ బృందం అదుపులోకి తీసుకుంది. దాడిలో పాల్గొన్న అనేక మంది సంఘటన స్థలం నుంచి తప్పించుకోగలిగారు. అదుపులోకి తీసుకున్న వేటగాళ్ల వద్ద దొరికిన తుపాకీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడికి పాల్పడిన మిగిలిన వారి వివరాలు తదితర అనుబంధ సమాచారం కోసం ఆరా తీస్తున్నారు.


వేటగాళ్ల కాల్పులతో సిబ్బంది మృతి

అక్రమ వేట కార్యకలాపాలను అరికట్టే విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై వేటగాళ్ల ముఠా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రహ్లాద్ ప్రధాన్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. వెంటనే అతన్ని హిందోల్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత ఉన్నత చికిత్స కోసం అక్కడి నుంచి అంగుల్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. బుల్లెట్ గాయాలతో అతను మరణించినట్లు అక్కడి వైద్యులు ప్రకటించారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి నలుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నామని ఢెంకనాల్ మండల అటవీ అధికారి (డీఎఫ్ఓ) సుమిత్ కుమార్ కొరా తెలిపారు.

రూ. 30 లక్షల పరిహారం

ఢెంకనాల్ జిల్లా హిందోల్ రేంజ్‌లోని రాజ్‌మోహన్‌పూర్ అడవిలో గస్తీలో ఉన్న ఫారెస్ట్ గార్డ్ ప్రహ్లాద్ ప్రధాన్ ప్రాణాలు కోల్పోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రూ. 30 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. పీసీసీఎఫ్ ప్రత్యక్షంగా సంఘటనా స్థలాన్ని సందర్శించి తదుపరి దర్యాప్తు పటిష్టంగా జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

• అంకితభావంతో సేవ చేయండి



సమాజంలో అన్ని వర్గాలకూ అంకితభావంతో సేవలందించి విలువలకు పట్టం గట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి యువ ఐఏఎస్ అభ్యర్థులను ప్రోత్సహించారు. స్థానిక రాజ్ భవన్‌లో 2024వ బ్యాచ్ (ఒడిశా కేడర్) ఐఏఎస్ ఆఫీసర్ ట్రైనీలతో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రత, కరుణ, సమభావంతో కూడిన సేవలతో దృఢమైన సమాజ నిర్మాణంలో పాత్రధారులు కావాలని అభినందించారు.


- భువనేశ్వర్

పాకిస్తాన్ అనుకూల నినాదాలు

• ఇద్దరు అరెస్టు

భువనేశ్వర్: పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసిన ఆరోపణ కింద ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఆ నినాదాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ విషయమై చౌలియాగంజ్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు నమోదైంది. ఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కటక్ చౌలియాగంజ్ ఠాణా పోలీసులు ఈ ఇరువురిని శనివారం అరెస్టు చేశారు.

ఇంగ్లండ్‌కు ఢెంకనాల్ మామిడి పండ్లు



ఇంగ్లండ్‌కు ఎగుమతి అయిన ఢెంకనాల్ ఆమ్రపాలి మామిడి పండ్లు



విదేశాలకు రాష్ట్ర మామిడి పండ్ల ఎగుమతి

భువనేశ్వర్: ప్రపంచం ఇప్పుడు ఒడిశా మామిడి పండ్ల మాధుర్యం ఆస్వాదిస్తోంది. ఢెంకనాల్ నుంచి ప్రీమియం ఆమ్రపాలి మామిడి పండ్లు ఇంగ్లండ్‌కు ఎగుమతి అయ్యాయి. కేవలం 3 రోజుల్లోనే 5 మెట్రిక్ టన్నులు (ఎమ్‌టీ) మామిడి పండ్లు ఇంగ్లండ్‌కు ఎగుమతి కావడం విశేషం. పనస, మునగకాయలు వంటి ఒడిశా వ్యవసాయ ఉత్పాదనలు రోమ్, వెనిస్, బర్మింగ్‌హామ్‌లలో నోరూరించే పదార్థాలుగా రాజ్యమేలుతున్నాయి. రాష్ట్ర రైతుల అవిశ్రాంత అంకితభావానికి ఈ విజయం నిలువెత్తు తార్కాణమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించారు.



ఇంగ్లండ్‌కు ఢెంకనాల్ మామిడి పండ్ల ఎగుమతి

క్లుప్తంగా

కె.కొత్తూరులో దొంగల హల్‌చల్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామంలో శనివారం వేకువజామున దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికులు గుర్తించి కేకలు వెయ్యడంతో వారు తమతో తెచ్చుకున్న కత్తిని చూపించి గ్రామస్తులను భయపెట్టే ప్రయత్నం చేయగా అందులో ఓ యువకుడిని గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం ఆ యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు. కొద్దిరోజుల కిందట నందిగాం మండలం తామరాపల్లి వద్ద లారీ డ్రైవర్లను కత్తితో బెదిరించి డబ్బులు తీసుకున్న వ్యక్తులు, కె.కొత్తూరులో చోరీకి పాల్పడిన వ్యక్తులు ఒక్కరేనా అన్నదానిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



గొట్టా బ్యారేజ్ వద్ద ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్ హనుమంతరావు

హిరమండలం: మండలంలోని వంశధార గొట్టా బ్యారేజ్ దిగువ భాగంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ హనుమంతరావు సీజ్ చేశారు. శనివారం సాయంత్రం గొట్టా బ్యారేజ్ దిగువ భాగంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్, పోలీసులు సమన్వయంతో వెళ్లి పట్టుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ ఉమా శంకర్, వీర్వో భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నారాయణరావు(ఫైల్)

నందిగాం: కొత్తగ్రహారం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బడగాం పంచాయతీ శారదాపురం గ్రామానికి చెందిన బూరె నారాయణరావు (59) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావు టెక్కలి నుంచి పలాస వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొత్తగ్రహారం మీడియం ఓపెన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నారాయణరావు ఎగిరిపడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు స్పందించి హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నారాయణరావుకు భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా..

- పిడుగుపాటుకు యువకుడు బలి



మృతిచెందిన శివ

టెక్కలి రూరల్: బన్నువాడ పంచాయతీ పితాపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం పిడుగు పాటుకు గుర్రై మోర్చి శివ(26) అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం పెద్దకేసినాయుడుపేటకు చెందిన శివ పితాపురం సమీపంలో పోర్టు రోడ్డు నిర్మాణంలో భాగంగా జరుగుతున్న వంతెన పనులకు శనివారం హాజరయ్యాడు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడటంతో పనులు ఆపి అదే ప్రాంతంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే శివ మృతిచెందాడు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వివాహ వేడుకలో కొట్లాట

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకలో డీజే నిర్వాహకులు, పెళ్లికి వచ్చిన బంధువర్గానికి మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారితీసింది. పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపిన వివరాల మేరకు.. పట్టుపురం గ్రామానికి చెందిన దాసరి సాయికుమార్ అనే వ్యక్తి సిరియాఖండి గ్రామంలో జరిగి న పెళ్లి వేడుకకు వెళ్లాడు. రాత్రి సమయంలో పెళ్లి ఊరేగింపు కోసం తీసుకొచ్చిన డీజే వ్యాన్‌లో నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత డీజే యజమాని వెంకటరావు, మరికొందరు వచ్చి లేపి పంపించేశా రు. ఇంతలోనే సాయికుమార్ డీజే వ్యాన్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోవడంతో నిర్వాహకులు వెంబడించా రు. వ్యాన్‌ను అడ్డుకుని సాయికుమార్‌ను దొంగగా భావించి డెకరేషన్ క్లాత్‌లతో కట్టేసి కొట్టారు. కొంతసేపటి తర్వాత సాయికుమార్ బంధువు వచ్చి గుర్తుపట్టి అడ్డుకోవడంతో.. తిరిగి సిరియాఖండిలో ని పెళ్లి వద్దకు సాయికుమార్‌ను తీసుకొచ్చారు. గాయాలతో ఉన్న సాయిని చూసి తమ్ము డు ప్రదీప్ డీజే నిర్వాహకులపై దాడికి పాల్పడ్డాడు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పాతపట్నం సీఐ వి. రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

99 శాతం పనులు పూర్తి

పర్లాకిమిడి:

అమృత్ స్టేషన్ల నవీకరణలో భాగంగా పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌లో పనులు 99 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఫ్లెటైవర్ బ్రిడ్జి కింద లిఫ్ట్ పనులు కొనసాగుతున్నాయి. ఒడిశాలో ఆజాదీ అమృత్ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనుల వేగవంతంలో పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఏడో స్థానంలో ఉంది. రైల్వేస్టేషన్ ఆవరణలో అందమైన మొక్కలతో పాటు కోణార్క్ చక్రం, పాత స్టీమ్ ఇంజిన్ నమూనా, వాహనాల పార్కింగ్, స్వాగత ద్వారం వద్ద కళింగుల చిహ్నంగా సింహాలు, ప్లాట్ ఫారంపై స్టీల్ కుర్చీలు, టాయిలెట్సు నిర్మిస్తున్నారు. పర్లాకిమిడి మహారాజా విగ్రహం స్టేషన్ ఆవరణలో ఉంచాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే నెలాఖరు లోగా పనులను పూర్తిచేసి ఆగస్టు 15లోగా ప్రారంభోత్సవం జరపడానికి ఈస్టుకోస్టు రైల్వే, వాల్తేరు డీఆర్ఎం సన్నాహాలు చేస్తున్నారు.



రైల్వే స్టేషన్ స్వాగత ద్వారం వద్ద జరుగుతున్న పనులు



జోరుగా సాగుతున్న ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ పనులు



పర్లాకిమిడి రైల్వే స్టేషన్‌కు కొత్త రూపురేఖలు



ఆధునికీకరించిన పర్లాకిమిడి రైల్వే స్టేషన్



రాత్రివేళ వెలుగులతో పర్లాకిమిడి రైల్వే స్టేషన్



పూర్తయిన రైల్వేప్లాట్‌ఫారం పనులు.



పర్లాకిమిడి పాత రైల్వే స్టేషన్

జాతీయ విద్యా విధానం యువతకు సోపానం



సదస్సుకు హాజరైన విద్యావేత్తలు

- గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: యువతలో సాధికారిత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 భారీ సంస్కరణ అని, విద్యా రంగంలో ఇదో మైలురాయి అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. శనివారం జరిగిన విద్యా సదస్సులో ప్రసంగించారు. అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలతో దేశ యువతను సన్నద్ధం చేయాలనే దృఢ సంకల్పంతో జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టారన్నారు. సమయానుకూలంగా చోటు చేసుకుంటున్న ప్రపంచ స్థాయి మార్పులతోపాటు దేశ విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. సాధికారత కలిగిన వ్యక్తులతో దేశం పురోగతి ప్రారంభమవుతుందన్నారు. సాధికారితకు విద్యాభ్యాసం పునాదిగా నిలుస్తుందన్నారు. సాధారణ జీవనశైలిని ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ), యాంత్రిక శిక్షణ, రోబోటిక్స్ వంటివి వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. యువతలో వ్యవస్థాపకతను పెంపొందించడానికి సంప్రదాయ విద్యను, నైపుణ్య అభివృద్ధితో అనుసంధానం చేసి ఉపాధిని మెరుగుపరచడానికి కొత్త విద్యా విధానం బలమైన వారధిగా ఉంటుందన్నారు. విద్యా సంస్థలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాల సమన్వయంతో నైపుణ్య ఆధారిత కోర్సులను పాఠ్యాంశాల్లోకి చేర్చాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, నిపుణులను కోరారు. కొత్త జాతీయ విద్యా విధానం 2047 నాటికి వికసిత భారత దేశం ఆవిష్కరణ దిశలో జాతీయ విద్యా విధానం ఉద్యోగ సృష్టికర్తలను సిద్ధం చేస్తుందన్నారు. విద్యా సదస్సులు అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడానికి అర్థవంతంగా దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక ప్రైవేట్ టెలివిజన్ సంస్థ ఈ సదస్సుని ఏర్పాటు చేసింది.



విద్యా సదస్సులో గవర్నరు ప్రసంగం

ఆదర్శంగా కుంతరకల్



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు, ఫౌండేషన్ ప్రతినిధులు

జయపురం: జయపురం సమితి బలియ గ్రామ పంచాయతీ కుంతర్‌కల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు జయపురం వికాశ సంకల్ప ఫౌండేషన్ నిర్ణయం తీసుకుంది. శనివారం ఆ గ్రామంలో సమావేశం నిర్వహించింది. మహిళా స్వశక్తీకరణ, రైతుల స్వశక్తీకరణ, వ్యవసాయ ఉత్పత్తులపైన, దేశీ విత్తన రకాల ఉన్నతిపరచే విషయం, వివిధ రంగాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి పథకాలపైన వికాశ సంకల్ప ఫౌండేషన్ సభ్యులు గ్రామ ప్రజలతో చర్చించారు. ఆదర్శ గ్రామంగా నిలవాలంటే మహిళలు, యువకులు, రైతులు స్వయం శక్తితో ఆర్థిక ప్రగతి సాధించాలని, పిల్లలు విద్యావంతులు కావాలని ఫౌండేషన్ సభ్యులు సూచించారు. అందుకు అవసరమైన సహకారం తాము అందిస్తామని వెల్లడించారు. గ్రామ బుడీఠకురాణి గ్రూపు సభ్యుడు మణి బారిక్, జగత్‌జననీ గ్రూప్ సభ్యురాలు జమున నాయక్, గ్రామ ప్రతినిధులు మధు బారిక్, సుభాష్ బారిక్, ఫౌండేషన్ ప్రతినిధులు నిరాకార చౌదరి, విష్ణు ప్రసాద్ సాహు, సుబ్రత్ పండా, కుమారి లిజాలిన్ మహరాణ, వికాశ సంకల్ప ఫౌండేషన్ కార్యదర్శి పార్థసారధి పండా, ఉపాధ్యక్షుడు దొంబుదొర పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు సిగ్గుచేటు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా అనేక మందిని హత్య చేసిన మోదీ ప్రభుత్వం ఏదో ఘనకార్యం సాధించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని వక్తలు మండిపడ్డారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్జీఓ హోంలో వామపక్ష నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు చర్యలను వీడకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే వారి మృతదేహాలను బంధువులకు అప్పగించాలని కోరారు. శాంతియుతంగా చర్చలకు కేంద్ర ప్రభు త్వం దిగిరావాలన్నారు. నంబాల కేశవరావుతో పాటు ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నారాయణపూర్‌తో సహా అడవుల్లో సాగిస్తున్న మారణహోమంపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఖనిజ సంపదలు, ప్రకృతి వనరులతో కూడిన అడవులను బడా కార్పొరేట్లకు అప్పగించే ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో వామపక్ష, వివిధ సంఘా ల నాయకులు వంకల మాధవరావు, పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చాపర వెంకటరమణ, దు ప్పల గోవిందరావు, ఎం.రామారావు, గురవయ్య, ఎం.లక్ష్మి, పత్తిరి దానేషూ, కె.వి.జగన్నాథరావు, కోదండం, మద్దిల ధర్మారావు, కూర్మారావు, మిస్క కృష్ణయ్య, పి.పద్మ, కృష్ణవేణి, పోలా ఈశ్వరరావు ఎన్.నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

బీడు భూముల్లో తోటల పెంపకంతో ఆదాయం



రత్నాల వరప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీడుభూములను అనవసరంగా వదిలేయకుండా ఉద్యాన శాఖ సలహాలతో అనువైన తోట పంటలు వేసుకుంటే సుస్థిర ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ ఏడీ ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 3,550 హెక్టార్ల బీడు భూములు ఉన్నాయని, వీటిని ఉద్యాన పంటల (తోటల) సాగుకు ఉపయోగిస్తే ఆయా భూముల విలువను పెంచడమే కాకుండా, సాగులో ఉన్న అనిశ్చితిని తగ్గించి దీర్ఘకాలిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడి మామిడి, కొబ్బరి మొదలైనవి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లి వంటి పూల సాగు, ఆయుర్వేద గుణాలు, సుగంధ తైల మొక్కల సాగూ ఇందులో భాగమేనన్నారు. తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగి ఉండటంతో బీడుభూములకు ఎంతో అనుకూలంగా ఉంటాయన్నారు. 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అమర్చుకొనడం ద్వారా 60 – 80 శాతం నీటిని ఆదా చేసుకుని బీడు భూములను సస్యశ్యామలం చేసుకోవచ్చన్నారు.

కంప్యూటర్ అకౌంటెన్సీలో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలోని యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఇంటర్మీడియట్ అర్హత ఉన్న వారికి కంప్యూటర్ అకౌంటెన్సీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 38 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల యువత అర్హులని చెప్పారు. ఎంఎస్ ఆఫీస్, టాలీ, జీఎస్‌టీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నిర్మించిన రెండు నెలలకే శిథిలమైన రోడ్డు!



పాడవుతున్న కదమగుడ- మహుళిపుట్ రోడ్డు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో రెండు నెలల కిందట రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెన, తారు రోడ్డు అప్పుడే పాడైపోతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టిబెర్ములు కరిగిపోతున్నాయని, రోడ్డుపై తారు ఊడిపోతుందని కదమగుడ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బొయిపరిగుడ సమితి జి.మరిఖిగుడ పంచాయతీలో కదమగుడ నుంచి మహుళిపుట్‌ను రహదారి సంబంధాలు కలిపేందుకు నాలుగేళ్ల కిందట ఆర్‌డీ విభాగం వంతెన, రోడ్డు నిర్మాణానికి రూ. రెండున్నర కోట్లు మంజూరు చేసింది. టెండర్ అయిన తరువాత కంట్రాక్టర్ వంతెన పనులు మందకొడిగా జరపటంతో తామంతా పలుమార్లు అధికారులకు తెలియజేయటంతో ఎట్టకేలకు వంతెన నిర్మాణం పూర్తిచేసినట్టు స్థానికులు తెలిపారు. వంతెన పని పూర్తి చేసిన కంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించి కదమగుడ, మొహుళిపుట్‌ల మధ్య నిర్మించే ఈ మార్గంపై ఉలదాస్‌పూర్, మంగిడి, తోటపడ, బోమెల్, సెమిలిపాదర్, దురుకగుడ, కాతపడ గ్రామాల ప్రజలు ఆధారపడుతున్నారని వెల్లడించారు. జి.మరిఖిగుడ పంచాయతీకి వెళ్లాలంటే ఆ గ్రామాలన్నింటికీ ఆ దారి తప్ప మరో దారి లేదు. అయితే కొత్తగా నిర్మించిన ఈ రోడ్డు రెండు నెలలు కూడా కాకుండానే పాడవుతోంది, పెద్ద వాహనాలు వెళ్తే రోడ్డు పక్కన బీటలు పడుతూ కూలిపోతున్నట్టు చెబుతున్నారు. నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆమరణ నిరాహార దీక్ష విరమణ



చర్చలు జరుపుతున్న ఏడీఎం ఫల్గుణీ మఝి, చైర్‌పర్సన్ నిర్మలా శెఠి

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద గత నాలుగు రోజులుగా వివిధ డిమాండ్లపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బస్తీ సురక్షా మంచ్ శనివారం ఉదయం ఆదనపు జిల్లా మాజిస్ట్రేట్ ఫల్గుణ మఝితో జరిపిన చర్చలలు ఫలప్రదం కావడంతో ఆందోళన విరమించారు. 14వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ వాసులకు బెత్తగుడ వద్ద ఏడుగురుకి ఇళ్ల పట్టా మంజూరు, కాలనీలో స్వచ్ఛ, తాగునీరు సరఫరా ఐదు రోజుల్లో పరిష్కరిస్తామని, ఇళ్ల లేని నిరుపేదలకు బిజూ జాగా మిషన్ ద్వారా బెత్తగుడ వద్ద పట్టాలు మంజూరు చేస్తామని ఏడీఎం ఫల్గుణ మఝి అంగీకరించారు. దీనికి బస్తీ సురక్షా మంచ్ నాయకుడు సుజిత ప్రధాన్ అంగీకరించడంతో బస్తీవాసులు నిరాహార దీక్షను విరమించారు. ఈ చర్చల్లో పురపాలక సంఘం చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, ఈఓ లక్ష్మణ ముర్ము, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు పైల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఒడిశా గ్రోత్ ఇంజిన్: సీఎం



నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: దేశాభివృద్ధిలో ఒడిశా గ్రోత్ ఇంజిన్‌గా సారథ్యం వహిస్తుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి ఈ విషయం తెలిపారు. రాబోయే పాతికేళ్లలో దేశ అభివృద్ధి ప్రయాణంలో ఒడిశా వృద్ధి చోదకంగా ఉంటుందని గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి తన ప్రభుత్వం సాధించిన 18 విజయాలను ప్రస్తావించారు. 2036 నాటికి ఒడిశా ఆర్థిక వ్యవస్థ 500 బిలియన్ డాలర్లకు చేరుకుని 2047 నాటికి 1.5 ట్రిలియన్ డాలర్లకు ఎదగాలని ఒడిశా ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రానున్న ఐదేళ్లలో న్యాయమైన, పారదర్శక మార్గంలో 1,50,000 ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లక్ష్యంగా పేర్కొన్నారు. మెరుగైన ప్రజా వ్యయంపై నిబద్ధతతో నాణ్యమైన ప్రజా జీవనం కోసం బలమైన ఆర్థిక క్రమశిక్షణతో వృద్ధి పెంపొందించే దిశలో ప్రవేశ పెడుతున్న పథకాలు విజయవంతం అవుతున్నాయి. మహిళా సాధికారత సాధనలో సుభద్ర యోజన అద్భుత సంస్కరణగా వెలుగొందుతుంది. 16 లక్షలకు పైగా లక్షపతి దీదీలతో ఒడిశా దేశంలో అగ్ర స్థానంలో నిలవడం తార్కాణంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 అమలు చేయడం జరిగింది. గోదావరిష్ మిశ్రా ఆదర్శ ప్రాథమిక విద్యాలయం పథకం అమలుతో పిల్లల్లో ప్రాథమిక దశ నుంచి భాష, గణిత నైపుణ్యాలను అభివృద్ధికి బలమైన పునాది వేసి ఉన్నత విద్యకు వారిని సిద్ధం చేయడానికి సుమారు 7,000 ప్రాథమిక పాఠశాలలను అధునాతన మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు, జీవిత నైపుణ్యాల విద్యతో కూడిన వనరులతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్–ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన అమలుతో 1 కోటి పైబడిన కుటుంబాలకు రూ. 5 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన ఉత్కర్ష్ ఒడిశా కాన్‌క్లేవ్ 20 రంగాల విస్తరణకు రూ.16.73 లక్షల కోట్ల పెట్టుబడితో 593 ప్రతిపాదనలు అందడం విశేషం. రాష్ట్రంలో వ్యాపారం, పరిశ్రమల పర్యావరణ వ్యవస్థను సులభతరం చేయడానికి, చిన్నపాటి పొరపాట్లు, సాంకేతిక లోపాలను సమర్థంగా పరిష్కరించడానికి చట్టాలను అమలు చేయడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.



భారత ప్రధాన మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

క్లుప్తంగా

ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా జగన్మోహనరావు



డాక్టర్ జగన్మోహనరావుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం టౌన్: ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ టి.జగన్మోహనరావును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులను డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు అందజేశారు. కమిషనర్, ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి పొరుగు సేవల ప్రాతిపదికన డాక్టర్ జగన్మోహనరావును ఎన్‌సీడీ - ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయని డీఎంహెచ్‌వో తెలిపారు. గతంలో డీఐవో, డీఎంవో, ఇంచార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, పలు ఆరోగ్య కార్యక్రమాలకు ప్రోగ్రాం అధికారిగా జగన్మోహనరావు జిల్లాలో పని చేశారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, వ్యక్తులతో ఎస్‌ఐ సుదర్శన్, తహసీల్దార్ రాములమ్మ, సిబ్బంది

వేపాడ: మండలంలోని పాటూరు జంక్షన్ సమీపంలో కారులో రవాణా చేస్తున్న రెండు కేజీల గంజాయి పట్టుకున్నట్టు వల్లంపూడి ఎస్‌ఐ ఎస్.సుదర్శన్ తెలిపారు. శనివారం ఎస్.కోట – కొత్తవలస ప్రధాన రహదారిలో పాటూరు వద్ద ఎస్‌ఐతో పాటు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు నుంచి విశాఖ వైపు వెళ్తున్న మారుతీ సుజుకి తెలంగాణకు చెందిన కారులో ఇద్దరు వ్యక్తులు గంజాయితో పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయితో పాటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. తనిఖీల్లో తహసీల్దార్ జె.రాములమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

భామిని: మండలంలోని కోసలికి చెందిన కరణం తిరుపతిరావును పోక్సో చట్టం కింద శనివారం అరెస్టు చేసి కొత్తూరు కోర్టులో హాజరు పరిచినట్టు బత్తిలి ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపారు. ఈ నెల 22న కోసలికి చెందిన పదేళ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఉడుమును పట్టుకున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం గంటస్తంభం: జొన్నాడ జంక్షన్ వద్ద ఈ నెల 19వ తేదీన గణేష్‌నగర్‌కు చెందిన వనము తాతా అనే వ్యక్తి ఉడుమును పట్టుకుని సంచరిస్తుండగా డీఎఫ్‌వో బి.శ్రీనివాసరావు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఉడుమును చంపడం నేరమని, వన్యప్రాణులను చంపినా, వాటిని కొనుగోలు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఉడుమును పట్టుకున్న వనము తాతాపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ నేతలే టార్గెట్..!

విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో అరెస్టై.. పోలీస్ కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లను విచారణ జరుపుతున్న ఎన్‌ఐఏ అధికారులు, స్థానిక పోలీసులకు విస్తుపోయే అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, ఆలయాలను దర్శించుకునే భక్తులే టార్గెట్‌గా పేలుళ్లు జరపాలని నిర్ణయించినట్టు భోగట్టా. విజయనగరం జిల్లాలో అధికమంది భక్తుల ప్రాణాలు తీసేలా ఐదుచోట్ల బాంబులు పేల్చేందుకు ఇమ్రాన్, బలుజిస్తాన్ అనే వ్యక్తులతో కలిసి పథక రచన చేసినట్టు సిరాజ్ తెలిపినట్టు సమాచారం. దీనికోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ క్రియేట్‌చేసి చాటింగ్ చేసినట్టు తెలిసింది. అవసరమైతే మానవబాంబుగా మారేందుకు కూడా సిద్ధపడినట్టు విచారణలో సిరాజ్ వెల్లడించినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ ఆధారాల ఆధారంగా యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించింది. విజయనగరం పీటీసీలో రెండోరోజు సిరాజ్, సమీర్‌లను ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌ఐఏ బృందం విచారణ జరిపింది. తొలుత వీరిద్దరూ నోరుమెదిపేందుకు ఇష్టపడకపోవడంతో వేర్వేరుగా విచారణ జరిపారు. విజయనగరం ఆబాద్‌వీధికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ల మధ్య కుదిరిన స్నేహం, ఇద్దరు సౌదీ, అక్కడ నుంచి ఉమెన్ దేశానికి ఎలా వెళ్లారు అన్న కోణంలో దర్యాప్తు సాగించినట్టు తెలుస్తోంది. సిరాజ్ కాల్ డేటా ఆధారంగా లోతుగా విచారణ జరుపుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: సాలూరు ఆర్టీసీ డిపోలో రోజు వారి వేతనంపై తాత్కాలికంగా డ్రైవర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 18 నెలలు గడువు నిండి ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు డిపోలో అధికారులను సంప్రదించాలని సూచించారు.

సాగుకు ముందస్తు సన్నద్ధం!



బూసాయవలసలో మొక్కజొన్న సాగుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

- కల్తీ విత్తనాలతో తస్మాత్..
- ప్రభుత్వ లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



కూరగాయ పంటల సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

రామభద్రపురం: ఖరీఫ్‌కు రైతులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలోనే విత్తు పడితే సిరుల పంట పండుతుందని రైతుల నమ్మకం. జిల్లాలో ప్రధానంగా వరి 91,214 హెక్టార్లు, మొక్కజొన్న 12,386 హెక్టార్లు, పత్తి 2142 హెక్టార్లు, చెరకు 4,720 హెక్టార్లు, వేరుశనగ 369 హెక్టార్లు, వివిధ రకాల కూరగాయలు 350 హెక్టార్లలో సాగు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కొద్దిపాటి అకాల వర్షాలు పడడం వల్ల రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. పొలాలకు ఎరువులు తీసుకువెళ్లడం, దుక్కులు దున్నడం లాంటి పనులు చేస్తున్నారు. ఎప్పుడైతే వర్షాలు సమృద్ధిగా పడతాయో ఆ క్షణమే పొలంలో విత్తనాలు విత్తేందుకు వీలుగా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే విత్తనాలు తీసుకొని, ఇక్కడ అందుబాటులో లేని విత్తనాలను రైతులు ప్రైవేటు దుకాణాలపై ఆధారపడుతున్నారు. తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ కొందరు వ్యాపారులు రైతులను మభ్య పెడుతున్నారు. కల్తీ విత్తనాల బారిన పడి రైతులు ప్రతీ ఏడాది నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కల్తీ విత్తనాలను ముందే గుర్తించకపోతే నష్టపోక తప్పదని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టం జరిగినా ఆ తర్వాత సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందవచ్చు.

రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు

రైతు భరోసా కేంద్రాల్లో లభించని విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. కొన్నిచోట్ల ప్రభుత్వం అనుమతి లేకపోయినప్పటికీ అనధికారంగా కల్తీ విత్తనాలు తెల్ల సంచుల్లో విక్రయించే అవకాశం ఉంది. అలా విక్రయించే వారి సమాచారాన్ని తక్షణమే వ్యవసాయ శాఖాధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు తీసుకోవాలి. విత్తనాలతో పాటు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయ పంటలు సాగు చేసే రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారులు విత్తనాలు విక్రయించే డీలర్లకు, వ్యవసాధికారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దుకాణాలు యజమానులు విచ్చలవిడిగా విత్తనాలను విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వానికి రైతుల విన్నపం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు మండలంలోని నాయుడువలస గ్రామానికి చెందిన రైతులు. వీరు ఏమంటున్నారంటే.. గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500లు మూడు దఫాలుగా అందించేది. దీని వలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటు ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7,500లు రైతు ఖాతాల్లో జమ చేసేది. దీని వలన చిన్న సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది. మే నెలతో పాటు అక్టోబరు, జనవరి నెలల్లో నిధులు రైతుల ఖాతాల్లో పడేవి. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5500లు, రెండవ విడత అక్టోబరు నెలలో రూ.2 వేలు చొప్పున్న అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలను మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున్న ఇచ్చేవారు. ఈ ఏడాది మే నెల దాటుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో అతిగతీ లేదు. రాష్ట్ర ప్రభుత్వం తమకు పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో ముందుగా ఆర్‌ఎస్‌కేలలో లభించని విత్తనాలను ప్రభుత్వం గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. కొద్దిపాటి విత్తనాలను మొలకెత్తించాలి. 80 శాతం పైగా విత్తనాల మొలకల్లో తేడా వస్తే తక్షణమే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రతీ రైతు తాను కొనుగోలు చేసిన విత్తనాల షాపు యజమాని నుంచి రశీదు తీసుకోవాలి. కల్తీ విత్తనాలతో మోసపోతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. నష్టపోయిన రైతులు పరిహారం అందుకోవడానికి ఆధారాలు తప్పనిసరిగా ఉండాలి. వరి విత్తనాలు తెచ్చిన సంచులు జాగ్రత్తగా వుంచాలి. పంట చేతికి వచ్చే వరకు రైతులు విత్తనాలకు సంబంధించిన అన్నీ ఆధారాలు భద్రంగా ఉంచడం రైతులకు మేలు.

– వీటీ రామారావు,
వ్యవసాయ శాఖ జేడీ, విజయనగరం

లింగ నిర్ధారణ వెల్లడిస్తే క్రిమినల్ చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ పక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు స్కానింగ్ సెంటర్లను విధిగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని ఫెర్టిలిటి కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అచ్చుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణ, ఘోషాస్పత్రి గైనికాలజిస్టు డాక్టర్ జె.సుధ, పిల్లల వైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డీపీఆర్‌వో జానకమ్మ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో చోరీలకు అడ్డుకట్ట

- ఎస్పీ మాధవ్‌రెడ్డి





జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పార్వతీపురం రూరల్: ప్రజలు తీర్థ యాత్రలు, వేసవి విహార యాత్రలకు వెళ్లే సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పలు బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు, ప్రయాణికులకు పోలీసు శాఖ ద్వారా శనివారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లో వృద్ధులు, చిన్నారులను విడిచిపెట్టి బయటకు వెళ్లడం వల్ల మాటు వేసిన దొంగలు గమనించి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. చోరీల నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళం వేసి సొంత గ్రామాలకు లేదా వ్యక్తిగత అవసరాల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచి వెళ్లకూడదు. పరిసరాల్లో, వీధుల్లో కచ్చితంగా నిఘా కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లల్లో వృద్ధులను, చిన్న పిల్లలను విడిచిపెట్టి వెళ్లకూడదు. అత్యవసరమైతే ఇరుగు, పొరుగు వారిని గమనిస్తూ ఉండమని చెప్పాలి. బహుళ అంతస్తుల భవన సముదాయాల్లో సీసీ కెమేరాలతో పాటు 24/7 సెక్యూరిటీ గార్డులతో రాత్రి వేళల్లో రెస్కీని ఏర్పాటు చేసుకోవాలి. ఉక్కబోత దృష్టిలో ఇంటి బయట, మిద్దెలపై పడుకొనేటప్పుడు ఇంట్లో వున్న విలువైన వస్తువులపై తగు భద్రత చర్యలు తీసుకోవాలి. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడకుండా, తాళం వేసినట్లు కనబడకుండా కర్టెన్స్ ద్వారా జాగ్రత్తలు తీసుకొని ఇళ్లకు సంబంధించిన ప్రధాన గేట్లుకు లోపల భాగం ద్వారా లాక్ చేసుకొని వెళ్లాలి. అశ్రద్ధతో ఊళ్లకు వెళ్లే సమయంలో తాళాలను పూల కుండీల్లో, మ్యాట్స్ కింద, చెప్పుల స్టాండ్‌ల్లో పెట్టకూడదు. వాహనాలు పార్క్ చేసేటప్పుడు వీలైనంత మేరకు నిఘా ఉన్నచోట పార్క్ చేసేందుకు ఏర్పాటు చేసుకొని కచ్చితంగా హ్యాండిల్ లాక్ చేసి వెళ్లాలి. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నట్టు గుర్తిస్తే తక్షణమే సమీపంలో వున్న పోలీసుస్టేషన్‌కు లేదా డయల్ 100/112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. కచ్చితంగా జాగ్రత్తలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ సీఐ అప్పారావు, క్రైమ్ ఎస్‌ఐ సూర్యారావు తదితర సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్, పలు బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో మెయిన్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచరాం గ్రామానికి చెందిన కంచెర్ల అప్పలరాజు అనే వృద్ధుడు గాయాలు పాలయ్యాడు. ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు.. అప్పలరాజు కిరాణా సరుకులతో మెయిన్ రోడ్డుపై ప్రభుత్వ పాఠశాల ఎదురుగా బస్సు ఎక్కుతున్నాడు. అదే సమయంలో డ్రైవర్ బస్సును ముందుకు నడపడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో గాయాల పాలైన అప్పలరాజును కండక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేశారని తెలిపారు. బాధితుడి తమ్ముడి కుమారుడు కంచెర్ల ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన నడుపుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ మాజీ ముఖ్యమంత్రిపై ఉన్న అక్కసుతోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసి ప్రజలను, నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రేగిడి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇంటి వద్దే అందించిన రేషన్ బళ్లను రద్దు చేసి మళ్లీ రేషన్ దుకాణాల వద్దకే సరుకులు తీసుకునేందుకు ప్రజలను పంపించేందుకు నిర్ణయం తీసుకోవడం హేయమైన చర్యన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు దూరం చేయడానికే ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయమని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రేషన్ సరఫరా కోసం ఎండీయూ వాహనాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి నేరుగా సరుకులు సరఫరా చేసేవారన్నారు. ఇప్పుడు ఆ వాహనాలు రద్దు చేయడం వలన ప్రజలు ప్రభుత్వ సేవలకు దూరం అవుతారని పేర్కొన్నారు. జిల్లాలో 370 వాహనాలు రద్దు చేయడం వలన వాహన నిర్వాహకుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీ అమలు చేయక పోగా రాష్ట్రంలో ఈ వాహనాల రద్దుతో మరికొంత మందిని నిరుద్యోగులను చేసిందన్నారు. జిల్లాలో 1249 రేషన్ డిపోల్లో మళ్లీ పాత పద్ధతినే కొనసాగిస్తుండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పవని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వచ్చి సరుకులు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాలంటీర్ వ్యవస్థ రద్దు చేయడంతో ఇటువంటి వారికి సరుకులను ఎలా అందజేస్తారని అన్నారు. ఎండీయూ వాహనాల రద్దుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెనాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ఉన్నారు.

వడదెబ్బకు రైతు మృతి



శ్రీరాములదొర(ఫైల్)

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన శ్రీరాములదొర(74) అనే రైతు వడదెబ్బకు శనివారం గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం వీరఘట్టం మార్కెట్‌కు సామగ్రి తేవడానికి వెళ్లి మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీరాములదొర ఇంటికి వచ్చాడు. ఇంట్లో మంచంపై కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

కొత్తవలస : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన జోడు అప్పన్న(32)కు రిమాండ్ విధించినట్టు సీఐ షణ్ముఖరావు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నిందితుడు బాలికపై ఈ నెల 21వ తేదీన అత్యాచార యత్నానికి పాల్పడినట్టు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. శనివారం నిందితుడిని తుమ్మికాపల్లి జంక్షన్ సమీపంలో మాటు కాసి పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో ఎస్.కోట సబ్ జైలుకు తరలించినట్టు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో మతి స్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

- చాకచక్యంగా పట్టుకున్న రైల్వే, ఫైర్ సిబ్బంది



రైల్వేస్టేషన్‌లో రేకుల షెడ్ పై నుంచి యువకుడిని తాళ్లతో బంధించి దించుతున్న రైల్వే, ఫైర్ సిబ్బంది

కొత్తవలస : మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి కొత్తవలస రైల్వేస్టేషన్‌లో శనివారం విద్యుత్ వైర్లు పట్టుకొని చనిపోతానని హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటలు శ్రమించి రైల్వే సిబ్బంది, ఫైర్ పోలీస్‌లు ఆయనను చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మతి స్థిమితం లేని ఒక యువకుడు స్థానికులపై రాళ్లు రువ్వి బెదిరించాడు. సమీపంలో గల రైల్వేస్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ లైన్‌ల సమీపంలో గల రేకుల షెడ్‌పైకి ఎక్కి వైర్లు దగ్గరకు వెళ్లాడు. ప్రమాదం దిగిపో.. అంటూ స్థానికులు, రైల్వే సిబ్బంది సూచించినా కనీసం పట్టించుకోలేదు. ఎవరైనా దగ్గరకు వస్తే వైర్లు పట్టుకొని చనిపోతానని బెదిరించాడు. రైల్వే అధికారులు అప్రమత్తమై విశాఖపట్నం ప్రధాన రైల్వేస్టేషన్‌కు ఫోన్ చేసి ప్రధాన లైన్‌కు సంబంధించి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని రైల్వే సిబ్బందితో కలిసి ఆ యువకుడిని తాళ్లతో బంధించి కిందకు దించారు. అనంతరం విశాఖపట్నం తరలించారు.

యోగాంధ్ర శిక్షణ ప్రారంభం

- 26 నుంచి జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

విజయనగరం:

యోగాంధ్ర సాధనలో భాగంగా 100 మంది టీఓటీ, మాస్టర్ ట్రైనీలకు యోగ శిక్షణ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమైంది. విజయనగరం ఇండోర్ స్టేడియంలో ప్రత్యక్షంగా 30 మందికి, మిగిలిన 70 మందికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు పర్యవేక్షించారు. గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో సచివాలయం పరిధిలో ఏడుగురిని ఎంపిక చేసి ఆదివారం శిక్షణ ఇస్తారు. వీరితో బ్యాచ్‌కు 50 మంది చొప్పున గ్రామాల్లో విడతల వారీగా యోగ శిక్షణ ఇప్పిస్తారు. యోగాంధ్రపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 26 నుంచి ర్యాలీలు నిర్వహించనున్నారు.

ర్యాలీల నిర్వహణ ఇలా..

తేదీ	ప్రాంతం
26	బొబ్బిలి, తెర్లాం
27	రామభద్రపురం, బాడంగి
28	గజపతినగరం, బొండపల్లి
29	దత్తిరాజేరు, మెంటాడ
30	గరివిడి, చీపురుపల్లి
31	భోగాపురం, పూసపాటిరేగ
02	నెల్లిమర్ల, గంట్యాడ
03	ఎస్.కోట, ఎల్.కోట
04	కొత్తవలస, జామి
05	డెంకాడ, నెల్లిమర్ల నగర పంచాయతీ
06	విజయనగరం మండలం
07	రాజాం మండలం
09	గుర్ల, రాజాం టౌన్
10	రేగిడి అమదాలవలస, సంతకవిటి
11	మెరకముడిదాం, బొబ్బిలి మున్సిపాలిటీ
12	వంగర, విజయనగరం కార్పొరేషన్
13న	వేపాడ



యోగా శిక్షణలో సాధన చేస్తున్న మాస్టర్ ట్రైనీలు

జనావాసాల నడుమ కూలిన విద్యుత్ స్తంభాలు



సంఘటనకు కారణమైన ట్రాక్టర్, రోడ్డుకు అడ్డంగా పడిన విరిగిన విద్యుత్ స్తంభం



ప్రమాద తాకిడికి విరిగిన మరో స్తంభం

సంతకవిటి మండలంలోని కృష్ణంవలస గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి దిగువ వీధిలోని మట్ట దుర్గారావు ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ తాకిడికి అదే వీధిలోని మరో రెండు విద్యుత్ స్తంభాలు ఉన్న ఫలంగా విరిగి కింది పడ్డాయి. వీటితో పాటు మరో స్తంభం వాలిపోయింది. విద్యుత్ వైర్లు ఇళ్లను తాకుతూ వీధుల్లో చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరాను నిలిపి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ పరిణామంతో వీధుల్లోని ప్రజలు ప్రాణ భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు గ్రామాన్ని సందర్శించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. – సంతకవిటి